క్లుప్తంగా

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



చిన్నారికి గుండె పరీక్ష చేస్తున్న వైద్యులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శాంతినగర్‌లోని కోరమాండల్ మెడికల్ సెంటర్ వద్ద ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.శ్రీనివాస్‌రావు, సంస్థ యూనిట్ హెడ్ కె.వి.వి.వై.ఎస్.నారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా 0 నుంచి 18 ఏళ్ల వారికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించారు. సత్య సాయి, సంజీవిని హాస్పటల్స్ గుండె వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు.

కరాటేలో భార్గవ్‌కు ఆరెంజ్ బెల్ట్



సినీ నటుడు సుమన్ నుంచి బెల్ట్, సర్టిఫికెట్ అందుకుంటున్న భార్గవ్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురానికి చెందిన పెద్దిరెడ్ల భార్గవ్ కరాటే పోటీల్లో ఆరెంజ్ బెల్ట్ సాధించాడు. స్థానిక స్వామి వివేకానంద పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న భార్గవ్ నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన స్కూల్ స్థాయి కరాటే విన్యాసాల్లో ప్రతిభ చూపి ఆరెంజ్ బెల్ట్ పొందారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా భార్గవ్‌కు సర్టిఫికెట్, బెల్ట్ ప్రదానం చేశారు.

మానవత్వం చాటుకున్న యువకులు



వాసు, పావని దంపతులకు ఆర్థిక సాయం అందిస్తున్న డేంజర్ గైస్ సభ్యులు

మునగపాక: స్థానిక డేంజర్ గైస్ యువజన సంఘం సభ్యులు మానవత్వం చాటుకున్నారు. ఒకవైపు గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ మరోవైపు సోషల్ మీడియా ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. విశాఖలో గోపాలపట్నానికి చెందిన పావని, వాసు దంపతుల కుమారుడు అయాన్షేజా బోన్ మేరో వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందుకు గాను సర్జరీ చేయాల్సి ఉంది. బాబు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో సర్జరీ చేయించలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మునగపాకకు చెందిన యూ ట్యూబర్ సునీల్‌తోపాటు అనకాపల్లికి చెందిన యూ ట్యూబర్ మురళి, డేంజర్ గైస్ సభ్యులు కలిసి సోషల్ మీడియా ద్వారా మరింత ప్రచారం చేసి పలువురి నుంచి రూ.1,70,500 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని ఆదివారం వాసు, పావని దంపతులకు యువకులు అందజేశారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు



గుమ్మడికాయిలో దీపాలు వెలిగించిన భక్తులు

మద్రిపాలెం: మాధవధారలోని మాధవ స్వామి ఆలయంలో కొలువైన కాలభైవర స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో గుమ్మడి కాయలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి నెలా అమావాస్య రోజున ఇక్కడ భక్తులు పూజలు నిర్వహించడం విశేషం. జై కాలభైరవా అంటూ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

రహదారుణాలు

- మట్టిరోడ్లను తలపిస్తున్న బీఆర్‌టీఎస్ రహదారులు
- చీకటి పడితే ప్రమాదాలు
- మొక్కుబడిగా ప్యాచ్‌వర్కులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



104 ఏరియాలో ప్రమాదకరంగా రోడ్డు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంతతో వాహన చోదకులకు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. మరి కొన్ని మార్గాలను మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. -మద్రిపాలెం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి నుంచి కంచరపాలెం కూడలి మీదుగా జ్ఞానాపురం వెళ్లే 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్ కంచరపాలెం రైతుబజారు, నేతాజీకూడలి, శ్యామ్‌నగర్, బాపూజీనగర్ వద్ద రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

- కంచరపాలెం నుంచి 104 ఏరియా ఆశవానిపాలెం, అశోక్‌పార్క్ వెళ్లే రహదారి మీదుగా లోకోషెడ్ వాషింగ్‌లైన్‌కు వెళ్లే ఈ మార్గాల్లో ప్రయాణమంటే వాహనచోదకులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు.
- ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, సుంకరపేట, భవానీగార్డెన్స్, జ్యోతినగర్ మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్, కంచరపాలెం కూడలిలో భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడం, రహదారులు కుదించిపోవడం, అధిక మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలుపుతున్నారు.

గుంతలమయంగా రోడ్లు

మద్రిపాలెం నుంచి కంచరపాలెం వెళ్లే ప్రధాన బీఆర్‌టీఎస్ రహదారుల్లో బ్లాక్ తారు (బీటీ)రోడ్లు కానరావడం లేదు. మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లకు గతేడాది కూటమి ప్రభుత్వంలో అక్కడక్కడ పడిన గోతులు పూడ్చారు. అయితే నాణ్యత లేకపోవడంతో కప్పిన గుంతలు మళ్లీ యథాస్థితికి వచ్చాయి. రాళ్లు తేలి మట్టి రోడ్లను అయితే ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడ్డాయంటూ ప్రజాప్రతినిధులు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంకా భారీ వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



కంచరపాలెం కూడలి నుంచి జ్ఞానాపురం వెళ్లే రోడ్డులో వాహనదారుల పాట్లు

నాడు హడావుడి.. నేడు మౌనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో హడావుడి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నేడు రోడ్లు రాళ్లు తేలుతున్నా... మట్టి రోడ్లను తలపిస్తున్నా ఎందుకు దృష్టి పెట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు నేడు కనిపించక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వెలుగులు అంతంతే..

దీనికి తోడు రహదారుల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. చీకట్లో ప్రయాణ సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కంచరపాలెం రైతుబజారు సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన బీఆర్‌టీఎస్ రహదారి

రాకపోకలకు అవస్థలు



బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారుల్లో గోతులు పడి రాళ్లు తేలాయి. అటుగా రాకపోకలు చేసే సమయంలో వాహనాల తాకిడికి రాళ్ల పిక్కలు లేచి వంటికి తగులుతున్నాయి. కంచరపాలెం కూడలి నుంచి వెళ్లే రహదారుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చీకటి పడితే గుంతలను గుర్తించలేక ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయి. -కె.రాము, దుర్గానగర్, కంచరపాలెం

అధికారులు స్పందించాలి



ప్రమాదకర రహదారుల్లో ప్రయాణం నరకంగా ఉంటుంది. ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగిస్తే గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నాం. జ్ఞానాపురం నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లాలంటే ఈ రహదారినే వినియోగిస్తున్నాం. విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. – కె.శంకరరావు, జ్యోతినగర్, 104ఏరియా.

బాక్సింగ్‌లో మోహిత్‌కు బంగారు పతకం



మల్కాపురం: స్కూల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధికి చెందిన పల్లా మోహిత్ శివసాయియాదవ్ బంగారు పతకం సాధించాడు. మల్కాపురం సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న మోహిత్ యాదవ్ శ్రీహరిపురం ఎంపీటీసీ బాక్సింగ్ క్లబ్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నాడు. నగరంలో శుక్ర, శనివారాల్లో విశాఖ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో 30 నుంచి 32 కేజీల విభాగంలో జరిగిన పోటీలో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ గెలుపొందాడు. ఈ సందర్భంగా బాలుడిని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్‌లు, కోచ్‌లు అభినందించారు.

మండపాలకు చేరిన దుర్గమ్మ



సేవ గరిడీ, నృత్యాలతో దుర్గమ్మను తీసుకు వస్తున్న భక్తులు

మల్కాపురం: దుర్గాదేవి నవరాత్రుల సందడి మొదలైంది. సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దుర్గాదేవి విగ్రహాలను మండపాలకు చేర్చారు. 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలో శ్రీకృష్ణ యాదవ యూత్ సేవా సంఘం ప్రతినిధులు,సభ్యులు,కొత్తనక్కవానిపాలెం యాదవుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని గాజువాక ఆర్టీసీ డిపో నుంచి కొత్త నక్కవానిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వరకు మేళ తాళాల నడుమ ఊరేగింపుగా తీసుకు వచ్చారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా నక్క లక్ష్మణరావుయాదవ్, దాకరపు నూకరాజుయాదవ్, ఉరుకూటి బంగ్రరాజుయాదవ్,హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం



తీర ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలు, మద్యం బాటిళ్ల వద్ద ధర్మేంద్ర మిత్ర బృందం

మల్కాపురం: అందమైన ప్రకృతిని ప్లాస్టిక్ వ్యర్థాలతో మనమే నాశనం చేసుకుంటున్నామని 58వ వార్డు శ్రీహరిపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ముప్పిన ధర్మేంద్ర అన్నారు. ఆదివారం ఉదయం తన స్నేహితులతో కలిసి ఆయన యారాడ, ఆర్కే బీచ్, రుషికొండ బీచ్ తీర ప్రాంతాల్లో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం బాటిళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ మన ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీరం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేయడం వల్ల చేపలు మృత్యువాత పడతాయన్నారు. మన ప్రకృతిని కాపాడుకుంటూ.. భావితరానికి ఆరోగ్యకర వాతావరణాని అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

బుద్ధ గయను బౌద్ధులకు అప్పగించాలి



బుద్ధుడి విగ్రహం వద్ద శాంతియుత నిరసన తెలుపుతున్న బౌద్ధ సంఘం సభ్యులు

గోపాలపట్నం: గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన బిహార్ గయలోని మహాబోధి ఆలయాన్ని బౌద్ధులకు అప్పగించాలని జిల్లా మహాబోధి సొసైటీ బర్మా ఆంధ్రా బౌద్ధ సంఘం సభ్యులు కోరారు. మద్రిపాలెం వుడా లేఅవుట్ రైతుబజారు వద్ద బుద్ధ ధ్యాన వనంలోని బుద్ధ విగ్రహం వద్ద ఆదివారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ సంఘం అధ్యక్షుడు గుణపూడి బాబులు మాట్లాడుతూ బిహార్ ప్రభుత్వం 1949 బుద్ధ గయ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీటీఎంసీ కమిటీలో పూర్తిగా బౌద్ధులనే సభ్యులుగా నియమించాలని కోరారు. బౌద్ధుల న్యాయమైన కోరికను నెరవేర్చాలన్నారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతియుత నిరసన దీక్ష చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బౌద్ధ సంఘం కార్యదర్శి బోర వేణుగోపాల్, సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, వి.వి.దుర్గారావు, నవీన్, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న కేటీబీ అసోసియేషన్ సభ్యులు శ్రీనుబాబు, వైద్యుడు రాజేష్

గోపాలపట్నం: విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్ అన్నారు. కాకానినగర్‌లోని కేటీబీ కళాక్షేత్రంలో విద్య, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ పిల్లలుకోరుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. క్రీడల ద్వారా కూడా అనేక రంగాల్లో మంచి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. రక్షణ రంగంలో డాక్ యార్డు ఉద్యోగులు సేవలు అందిస్తూ ఈ విధమైన సమాజ సేవ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం భరత్‌ను సత్కరించి జ్ఞాపిక అందించారు. ప్రముఖ న్యూరాలజీ వైద్యుడు ఇందాల వెంకట రాజేష్ మాట్లాడుతూ సమాజ సేవ చేయడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని కోరారు. డాక్ యార్డు కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జబర్దస్త్ కళాకారులు అప్పారావు, అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, కార్యదర్శి వి. భాస్కరరావు, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో పరిశ్రమల మూత



మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో ఆదివారం డీవైఎఫ్ఐ మల్కాపురం జోన్ 10వ మహసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు అతిథిగా పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. మూడేళ్లకు సంబంధించిన నివేదిక ప్రవేశ పెట్టారు.దీన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ సర్కారు అవలంబిస్తున్న విధానాల వల్ల అనేక ప్రభుత్వరంగా పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు.వేలాది మంది కార్మికులు వీరి పాలనలో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వర్ధమాన నటుడు పైడిరాజుకు అభినందన



వర్ధమాన సినీ నటుడు పైడిరాజును సత్కరిస్తున్న అతిథులు

మల్కాపురం: మనసు అనే లఘు చిత్రం ప్రీమియర్ షో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ మనసు అనే లఘు చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. అనంతరం చిత్రంలో పావురాలు పట్టే క్యారెక్టర్ చేసిన మల్కాపురం వాసి ,వర్ధమాన నటుడు పైడిరాజును సత్కరించారు. చిత్ర దర్శకుడు పైడి శంకరరావును అభినందించారు.

ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని షిప్‌యార్డ్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.61వ వార్డు వెంకన్నపాలెం లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం హెచ్ఎస్ఎల్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ 9వ మహాసభ బి.ఎస్.ఎన్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. సీఐటీయూ నేత కుమార్ మంగళం పాల్గొని దివంగత నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభలో13 తీర్మా నాలు ప్రవేశపెట్టారు.అనంతరం నూతన కమిటీ నియామకం జరిగింది.అధ్యక్షుడిగా వాసుపల్లి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రసాద్‌తో పాటు 16 మందిని ఆఫీస్ బేరర్స్‌గా, 15 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

దుర్గమ్మ వైభవం

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం
- ముస్తాబైన ఆలయాలు, మండపాలు



ఉత్సవాలకు సిద్ధమవుతున్న దుర్గాదేవి విగ్రహాలు

గోపాలపట్నం: కరుణించి.. కాపాడే కనకదుర్గమ్మను మనసారా కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. దసరా పండగను పురస్కరించుకుని సోమవారం నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. వాడవాడలా యూత్ అసోసియేషన్లు మండపాలు ఏర్పాటు చేశాయి. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోని ఉద్యోగులు దుర్గా నవరాత్రులు పెద్ద ఎత్తున జరపడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. పోలీసుల నిబంధనల మేరకు ఎస్‌పీడీ, గోపాలపట్నం ప్రాంతాల్లో ఉత్సవ నిర్వాహకులు అమ్మవారి మండపాలు ఏర్పాటు చేశారు. ఆలయాలు, మండపాల ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధులన్నీ విద్యుద్దీప కాంతులతో నూతన శోభను సంతరించుకున్నాయి.



కరాసాలో ఏర్పాటు చేసిన మండపం

ప్రత్యేక పూజా కార్యక్రమాలు

గోపాలపట్నం పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో రోజుకొక అలంకరణలో దుర్గమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి రోజూ కుంకుమ పూజలు, శత నామార్చనలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొత్తపాలెం దేవి ఆలయంలో తొలి రోజు నవరాత్రి మహోత్సవ కలశ స్థాపన, పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, బాల త్రిపుర సుందరీ దేవి అవతార ధారణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు, 23న అన్నమయ్య కీర్తనలు, 24న కోలాటాలు, 26న సహస్ర దీపార్చన, 27న లలితా సహస్రనామ పారాయణ, అక్టోబర్ 1న అష్టోత్తర ఘటాభిషేకం, 2వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. బుచ్చిరాజుపాలెం, కరాసా మంగారమ్మ, దుర్గాలమ్మ అమ్మవార్ల ఆలయాల్లో ప్రతి రోజు సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయి.



కొత్తపాలెంలో ముస్తాబైన దుర్గాదేవి ఆలయ ప్రాంగణం



విద్యుత్ దీపాలంకరణలో బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయం

సిద్ధమైన అమ్మవారి విగ్రహాలు

మండపాల్లో ప్రతిష్ఠించేందుకు అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. కోల్‌కతాకు చెందిన కళాకారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఆర్డర్లు ఇచ్చిన వారు వారి విగ్రహాలు ఏ స్థాయికి వచ్చాయో పరిశీలించి తెలుసుకుంటున్నారు. అమ్మవారి విగ్రహాలను నిష్ఠతో తయారు చేస్తున్నామని, అలంకరణ పనులు పూర్తి చేశామని విగ్రహ తయారీదారులు తెలియజేశారు. దసరా పండగ తరువాత తామంతా కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోతామని కళాకారులు చెబుతున్నారు. నగరంలో సుమారు 6 నెలల మజిలీ పూర్తవుతుందని, మళ్లీ వచ్చే ఏడాది విగ్రహాలు తయారు చేసేందుకు వస్తామన్నారు.

విచ్చలవిడిగా మద్యపానం



మందుబాబులు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారు. తాగిన మైకంలో తూగుతూ రోడ్లపైనే పడకేస్తున్నారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులు పేటకు వెళ్లే రహదారిలో ఆదివారం కొందరు మద్యం తాగుతూ 'సాక్షి' కంటపడ్డారిలా..

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వేగవంతంగా నగర సుందరీకరణ పనులు



మీడియన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తాటిచెట్లపాలెం: నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జోన్-5 పరిధి తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు చేపడుతున్న మీడియన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.38 లక్షల జీవీఎంసీ నిధులతో జరుగుతున్న మీడియన్ సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ మార్గంలో రాబోయే రెండు రోజుల్లో ప్రముఖులు నగరానికి వస్తున్నందున పనులు నిలపాలని, బుధవారం నుంచి తిరిగి మొదలుపెట్టి పూర్తిచేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సంపత్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు.

బతుకమ్మ వేడుకలు ప్రారంభం



బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ మహిళలు

ఉక్కునగరం: తెలంగాణ ప్రజలకు ముఖ్య పండగైన బతుకమ్మ సంబరాలు ఉక్కునగరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో ఉద్యోగులు, తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు ఆటపాటలతో అలరించారు. సంఘం ముఖ్య సలహాదారు ఎన్. వీరేశం, అధ్యక్షుడు ఎన్. కుమారస్వామి, ప్రధానకార్యదర్శి జి. ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకటేశ్వర్లు, ప్రతినిధులు ఎన్. నర్సింగరావు, జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.